# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 24 | పేజీలు: 5 | వెల: రూ.4/- | శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## పర్యావరణ కృషికి అంతర్జాతీయ గుర్తింపు

### కేటీఆర్‌కు గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)

బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావుకు అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషికిగాను ప్రతిష్ఠాత్మకమైన 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపికయ్యారు. అమెరికాలోని న్యూయార్క్‌లో ఈ నెల 24న నిర్వహించనున్న 9వ ఎన్‌వైసీ గ్రీన్ సూల్ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్‌కు అవార్డు ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని గ్రీన్ మెంటార్స్ సంస్థ అధికారికంగా గురువారం కేటీఆర్‌కు తెలియజేసింది. 'గ్రీన్ మెంటార్స్ తరపున, గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025 గ్రహీతగా మీ ఎంపికను ధ్రువీకరించడం మాకు ఒక విశేషం' అని వారు ఆయనకు పంపిన లేఖలో పేర్కొన్నారు.

# రైల్వే అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- ఫ్యూచర్ సిటీ-అమరావతి మధ్య గ్రీన్ కారిడార్
- రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి
- కొత్త లైన్లకు అవసరమైన భూసేకరణకు సిద్ధం
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)

పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు- భూసేకర ణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు- ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు- కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగ పడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనం గా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే

..మిగతా 2లో



## 13న ప్రధాని మోడీ మణిపూర్ పర్యటన

### అక్కడి ప్రజల్లో సర్వత్రా ఆసక్తి

### ఎలాంటి హామీలు ఇస్తారన్న ఉత్కంఠ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13న కల్లోలిత మణిపూర్‌ను సందర్శించనున్నారు. విదేశాలకు వెళుతున్న మోడీ మణిపూర్ మాత్రం వెళ్లడం లేదని విపక్షాలు విమర్శలు చేస్తున్న వేళ ఆయన మణిపూర్ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్కడి ప్రజలతో మాట్లాడి వారికి స్వాంతన కలిగించే అవకాశం ఉంది. బ్రిటిష్ వలసపాలకులు మణిపూర్‌ను కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాలుగా విభజించి ఆ రెండిటిని వేర్వేరు పరిపాలనా వ్యవస్థల కింద ఉంచారు. ఈ వేర్పాటు- కొండ ప్రాంతాలలో అధికంగా ఉండే కుకీజోలు, మైదాన ప్రాంతాలలో సంపూర్ణ ప్రాబల్యమున్న మెయితీల మధ్య వైమనస్యతను సృష్టించింది. అది క్రమంగా తీవ్రతను సంతరించుకుని ఇప్పటికీ వైషమ్యాలను రగుల్కొలుపుతోంది.కొండ ప్రాంతాలలో ఉండే

..మిగతా 2లో



## ఓట్ చోరీపై త్వరలో 'అణుబాంబు' లాంటి ఆధారాలు

### లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

లక్నో సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)

ఓట్ చోరీ గురించి త్వరలో 'అణుబాంబు లాంటి ఆధారాలు' వెల్లడిస్తానని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. బిజెపి ఓట్ చోరీకి పాల్పడుతుందని పునరుద్ఘాటించారు.

ఓట్ చోరీకి సంబంధించి ఇప్పటికే కొన్ని సాక్ష్యాధారాలను వెల్లడించానని, భవిష్యత్తులో ' హైడ్రోజన్ బాంబ్ వంటి ఆధారాలు (ఎక్స్‌ప్లోజివ్ ప్రూఫ్) ' బయటపెడతానని అన్నారు.

తన నియోజకవర్గం రారుబరేలీలో రెండు రోజుల పర్యటన కోసం రాహుల్‌గాంధీ ఉత్తరప్రదేశ్ చేరుకున్న సంగతి తెలిసిందే. గురువారం జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిషా) సమావేశానికి అధ్యక్షత వహించారు. కలెక్టరేట్‌లోని బచత్ భవన్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) గురించి మాట్లాడారు. మహారాష్ట్ర, కర్ణాటక మరియు హర్యానాలో ఎన్నికలు

..మిగతా 2లో

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్


## 10 మంది మావోయిస్టులు మృతి



రాయ్‌పూర్, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)

ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ ప్రాంతంలో గురువారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఇప్పటి వరకు పది మంది మృతి చెందినట్లు సమాచారం. ఇందులో ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ అలియాస్ మోందం బాలకృష్ణ సైతం ఉన్నట్లు సమాచారం. రాయ్‌పూర్ రేంజ్ ఐజీ అమ్రేష్ మిశ్రా ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించారు. గరియాబంద్‌లో భద్రతా దళాలు, నక్సల్స్ మధ్య ఎదురుకాల్పులు జరిగాయని.. ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కొందరు మావోయిస్టులు చనిపోయి ఉండవచ్చని ఐజీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలోని పల్లి-బార్సూర్ రోడ్డు ప్రాంతంలో ప్రెజర్ ఐఈడీ పేలుడులో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. ఈ క్రమంలో తెల్లవారుజాము నుంచి భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. దంతేవాడ పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) గౌరవ్ రాయ్ మాట్లాడుతూ.. మందుపాతరలను నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ సమయంలో పేలుడు జరిగిందని పేర్కొన్నారు. ప్రెజర్ ఐఈడీ పేలుడులో ఇద్దరు జవాన్లు గాయపడ్డారని.. ఇందులో ఒకరు ఇన్‌స్పెక్టర్ అని పేర్కొన్నారు. బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజబుల్ స్క్వాడ్ టీమ్ జవాన్ గాయపడ్డట్లు చెప్పారు. గాయపడిన ఇద్దరు దంతేవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని.. మెరుగైన వైద్య సంరక్షణ కోసం రాయ్‌పూర్‌కు హెలికాప్టర్ ద్వారా తరలించనున్నట్లు తెలిపారు. గాయపడిన సిబ్బంది సీఆర్పీఎఫ్ 195 బెటాలియన్‌కు చెందినవారని చెప్పారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లుపై అసత్య వార్తలు




- బిల్లు ఇంకా గవర్నర్ వద్దే పెండింగ్
- వివరణ ఇచ్చిన రాజ్‌భవన్ అధికారులు

2

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

## సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురు స్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరా బాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేప థ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. నగరంలో పురాతన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తు.. చర్యల్లో భాగంగా.. పునరావాస కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్, పోలీసు అధికారులు సమన్వయం చేసుకుంటూ.. ఎటువంటి

..మిగతా 2లో

# రైల్వే అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**మొదటి పేజీ తరువాయి...**



అధికారులతో పాటు-, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎంతో పాటు- ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ- నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు- అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు- చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ- నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు- చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు- చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్తో పాటు- రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్లను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్న్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు- చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ- ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు- గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్తో పాటు- వరంగల్ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. శంషాబాద్ నుంచి చెన్నయ్ వరకు బుల్లెట్ ట్రైన్ కొత్త రైల్వే కనెక్టివిటీ- అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. పెండింగ్లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## 13న ప్రధాని మోడీ మణిపూర్ పర్యటన

**మొదటి పేజీ తరువాయి...**



కుకీజోలు, ఇంకా నాగాలు మొదలైన తెగలవారు రాష్ట్ర జనాభాలో 47 శాతంగా ఉన్నారు. అయితే వీరి అధీనంలో విస్తారమైన భూములు ఉన్నాయి. మైదాన ప్రాంతాలలో ఉండే మెయితీలు రాష్ట్ర జనాభాలో 53 శాతంగా ఉన్నారు వీరికి భూ వసతి తక్కువే అయినప్పటికీ మొదటి నుంచీ రాజకీయ అధికారం చెలాయిస్తున్న సామాజిక వర్గమిది. భూమి హక్కులతో పాటు- రాజకీయ అధికారంలో అసమ ప్రాతినిధ్యం విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. స్వతంత్ర భారతదేశంలో ప్రభుత్వాలు అనుసరించిన విధానాలతో ఆ ఘర్షణలు విషమించాయి. రాష్ట్ర రాజకీయాలపై పెత్తనం చెలాయిస్తున్న మెయితీలు తమకు షెడ్యూల్డు తెగ హోదా సాధించుకునేందుకు పూనుకున్నారు. తద్వారా కొండ ప్రాంతాలలోని భూములను తమ ఆర్థిక బలంతో కైవసం చేసుకోవచ్చునేది వారి ఆలోచన. మణిపూర్ హైకోర్టు 2023 ఏప్రిల్ 14న మెయితీలకు ఎస్టీ హోదా ఇవ్వాలని ఆనాడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రభుత్వానికి సూచించింది. మెయితీలకు ఎస్టీ హోదా లభిస్తే కొండ ప్రాంతాల భూములు సమస్తమూ వారి అధీనమవుతాయని తమకు మనుగడే కష్టమవుతుందని కుకీలు ఆందోళనకు గురయ్యారు. తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు కుకీజోలు పోరాటపథం పట్టారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పూర్తిగా మెయితీ పక్షపాతం వహించారు. కుకీజోల అలజడిని నిర్లక్ష్యం చేశారు. పైగా వారిని నార్కో టెర్రరిస్టులు అని నిందించారు. దీంతో కుకీజోలు మే 3న ఒక బృహత్ నిరసన ప్రదర్శనకు ఉద్యుక్తులయ్యారు. మెయితీలు ప్రతిదాడులకు పూనుకున్నారు. హింస ప్రజ్వరిల్లింది. అది దావానలంలా రాష్ట్రమంతటా వ్యాపించింది. వందల మంది బలయ్యారు. వేలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రెండేళ్లు దాటినా ఆ హింసాగ్నులు ఇంకా పూర్తిగా ఆరనేలేదు. మెయితీలు, కుకీజోలను దహించివేస్తున్న పరస్పర విద్వేషాగ్నులు మణిపురి సమాజాన్ని సైనికీకరణ చేశాయి. సంక్షోభానికి కారకుడైన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చివరకు పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయిన తరువాత రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించాలో తేల్చుకోలేకపోయిన మోదీ సర్కార్ రాష్ట్రపతి పాలనను విధించింది. అయినా పరిస్థితులు యథాతథంగా కొనసాగుతున్నాయి.

మెయితీలతో తమ సహజీవనం అసాధ్యమని, తమ ప్రాంతాలకు శాసన నిర్మాణ అధికారాలతో కేంద్ర పాలిత ప్రాంత హోదా నివ్వాలని కుకీజోలు డిమాండ్ చేస్తున్నారు. మెయితీలు, కుకీజోల మధ్య హింసాత్మక ఘర్షణలను నివారించేందుకు ఇరువర్గాల ప్రాంతాల మధ్య తటస్థ మండలాల నేర్పాటు- చేసి వాటిని కేంద్ర భద్రతా బలగాల కాపలాలో ఉంచారు. దీనివల్ల మణిపూర్లో ప్రజల, సరుకుల రవాణా నిర్నిరోధంగా

సాగడం అసాధ్యమైపోయింది. మణిపూర్లో పరిస్థితులు మెరుగుపడాలంటే కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించాలి. ఇది జరగాలంటే బీజేపీతో సహా అన్ని రాజకీయ పక్షాలు విశాల దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవల్సి ఉంది. ఇలా అతలాకుతలమైన ఈశాన్య భారత రాష్ట్రం శాంతి సాధించాలి. ప్రధాని మోదీ పర్యటనతో మార్పు వస్తుందా అన్నది చూడాలి. అక్కడి ప్రజలకు ఎలాంటి హామీలు ఇస్తారన్నది కూడా ముఖ్యం. అన్నింటికి మించి ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాల్సి ఉంది.

## గవర్నర్ పదవి నుంచి వైదొలిగిన రాధాకృష్ణన్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)**

భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఉపరాష్ట్రపతిగా నూతన బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. నేడు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. రాధాకృష్ణన్ రాజీనామాతో ఖాళీ అయిన మహారాష్ట్ర గవర్నర్ పదవికి తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్కు మహారాష్ట్ర బాధ్యతలను అదనంగా అప్పగిస్తూ రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తం 752 ఓట్లకు గాను ఆయనకు 452 ఓట్లు లభించాయి. మహారాష్ట్ర రాజ్ భవన్లో రాధాకృష్ణన్కు నిన్న సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాజీపడని జాతీయవాదినని స్పష్టం చేశారు. గవర్నర్గా కొనసాగిన 13 నెలల కాలాన్ని ప్రజాజీవితంలో సంతోషకరమైన సమయంగా అభివర్ణించారు. పరిపాలనాపరంగా, రాజకీయంగా మహారాష్ట్ర తనకు ఎంతో నేర్పిందని ఆయన అన్నారు.



## రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

**మొదటి పేజీ తరువాయి...**

ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వాగులపై ఉన్న లోతట్టు కాజ్వేలు, కల్వర్టులపై నుంచి నీటి ప్రవాహాలపైన అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెరువులు, కుంటలకు గండిపడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వదర నీరు చేరడంతో చెరువులను తలిపిస్తున్నాయి. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. హయత్నగర్లో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ ఆదేశాల మేరకు అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు.

### విజయవాడ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా.. నిమిషాల వ్యవధిలోనే రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్నగర్, అబ్దుల్లాపుర్ మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్సిటీ- పరిసర ప్రాంతాల్లో గంటన్నరపాటు- కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారిపై మోకాలి లోతు నీరు ప్రవహిస్తోంది. నగర శివారులోని హయత్నగర్ నుంచి సిటీ-వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్ను నియంత్రిస్తున్నారు. యాకుత్పురాలో ఓ చిన్నారికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఆరేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు మ్యాన్హోల్లో పడింది. బాలిక వెనుక వస్తున్న ఓ మహిళ ఇది గమనించారు. వెంటనే అప్రమత్తమై చిన్నారిని బయటకు తీశారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి. మరోవైపు మెదక్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో మూడున్నరగంటల వ్యవధిలోనే 13 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాజీపల్లిలో 9.2 సెం.మీ, పాతూర్లో 8 సెం.మీ మేర వర్షం కురిసింది. మెదక్ పట్టణంలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు- ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మెదక్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీని వరద ముంచెత్తింది. వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. మెదక్-హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరడంతో అధికారులు జేసీబీతో డివైడర్ను తొలగించారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లుపై అసత్య వార్తలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)**

తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లుపై సోషల్ మీడియాలో వైరల్గా మారిన వార్త అవాస్తవమని రాజ్భవన్ అధికారులు స్పష్టం చేశారు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లు ఇంకా పెండింగ్లోనే ఉందని తెలిపారు. రిజర్వేషన్ల బిల్లుపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. పలు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో.. విలీనం చేస్తూ.. జారీ చేసిన మెమోతో ఈ గందరగోళం నెలకొందని వివరించారు. అయితే.. గత కొన్ని గంటలుగా.. తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లకు లైన్ క్లియర్ అయ్యిందని.. సోషల్ విరీడియాలో, ప్రముఖ టీవీ ఛానల్స్లో ప్రచారం అయ్యింది. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం తెలిపినట్లు-, 50 శాతం రిజర్వేషన్ల క్యాప్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంటు-న్నట్లు- వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ మేరకు స్పందించిన రాజ్భవన్ అధికారులు ఇదంతా అవాస్తవమని తేల్చి చెప్పారు.




## ఓట్ చోరీపై త్వరలో 'అణుబాంబు' లాంటి ఆధారాలు

**మొదటి పేజీ తరువాయి...**

దోచుకోబడ్డాయి. అధికారికంగా మరియు వ్రాతపూర్వకంగా నమోదు చేయబడిన సాక్ష్యాలను సమర్పించానని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంచలన, ఎక్స్ప్లోజివ్ ప్రూఫ్ వెల్లడించనున్నామని అన్నారు. ఓట్ చోర్, గద్దిచోర్ అనే నినాదం దేశవ్యాప్తంగా వినిపిస్తోందని అన్నారు. రాష్ట్రాల్లో ఓట్లు దొంగిలించబడి ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయన్నది వాస్తవమని, వాటికి మీకు రుజువు ఇస్తామని హామీ ఇస్తున్నామని అన్నారు. హైడ్రోజన్ బాంబు పేలినపుడు, మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని, ఇప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని బిజెపి నేతలనుద్దేశించి ఎద్దేవా చేశారు.



## నేపాల్ తాత్కాలిక ప్రధాని రేసులో కుల్మన్ ఘిసింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)**

నేపాల్లో రాజకీయ సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఆపద్ధర్మ ప్రధాని రేసులో కొత్త వ్యక్తి దూసుకొచ్చారు. ఎలక్ట్రికల్ ఇంజినీర్ కుల్మన్ ఘిసింగ్ ఆ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. జెన్ జెడ్ నిరసనకారులు ఆయన మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చీఫ్గా ఉన్న ఆయన నేపాల్ తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కుల్మన్ ఘిసింగ్కు అధికార వర్గాల్లో మంచి గుర్తింపు ఉన్నది. ఆయనకు క్లీన్ ఇమేజ్ ఉంది. దేశంలో విద్యుత్తు సమస్యను తీర్చిన వ్యక్తిగా ఆయన్ను గుర్తిస్తారు. వాస్తవానికి ఆపద్ధర్మ ప్రధాని రేసులో కాఠ్మాండు మేయర్ బాలెన్ షా, మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి ఉన్నారు. కానీ వాళ్లను వెనక్కి నెడుతూ కుల్మన్ ఘిసింగ్ ముందుకు వచ్చారు. బాలెన్ షా, సుశీల కర్కిలు.. తాత్కాలిక ప్రధాని బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తిగా లేనట్లు తెలుస్తోంది. మాజీ జడ్జీలు ప్రధానులు కాలేరని రాజ్యాంగం చెబుతున్నట్లు కొందరు నిరసనకారులు వాదించారు. సుశీల వయసు 73 ఏళ్లు కావడంతో.. ఆ లేట్ ఏజ్లో ఆమె దేశాన్ని లీడ్ చేయలేరని విమర్శలు వచ్చాయి. కుల్మన్ ఘిసింగ్ ఇండియాలోని జెంషెడ్పూర్లో ఉన్న రీజినల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివారు. ఆ తర్వాత నేపాల్లోని పుల్చోక్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యను పూర్తి చేశారు. ఎంబీఏ కూడా చదివారాయన.

## తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ముజేసిన కాంగ్రెస్ సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)**



గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కారణమయిందని చెప్పారు. హైకోర్టు ఆదేశించినట్లు- పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అవకతవకలపై జ్యుడీషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 'సర్కారు కొలువుకోసం ఏళ్ల తరబడి కష్టపడి తమ విలువైన సమయాన్నీ, అమ్మా, నాన్నల కష్టార్జితాన్నీ ధారపోసిపోటీ- పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ముజేసింది ఈ కాంగ్రెస్ సర్కార్. అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకల కు కారణమయ్యింది. అంగట్లో కొలువులు అమ్ముకొని నిరుద్యోగుల గొంతుకోసింది. గ్రూప్ 1 పరీక్ష నిర్వహణలో ఫెయిల్ అయిన ఈ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదు. హైకోర్టు ఆదేశించినట్టు- గ్రూప్-1 పరీక్ష మళ్లీ తాజాగా నిర్వహించాలి. అవకతవకలపై జుడీషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలి. ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్ధానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేస్తున్నానంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## గ్రామ పాలనాధికారులకు
# నియామక పత్రాలు అందజేత



గ్రామ పరిపాలన అధికారులకు నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ సంతోష్



కలెక్టర్ సంతోష్ ను సన్మానిస్తున్న గ్రామ పరిపాలన అధికారులు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం) రెవెన్యూ శాఖలో ఎంపికైన గ్రామ పాలనాధికారులకు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ నియామక పత్రాలను అందజేశారు. గురువారం ఐడిఓసి కలెక్టర్ చాంబర్ నందు గ్రామ పాలనాధికారుల నియామక పత్రాలు కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలులో భాగంగా జీపీవోల నియామకాలను చేపట్టినట్లు తెలిపారు. భూ సంబంధిత విధి నిర్వహణలో పారదర్శకతతో, నిబద్ధతతో న్యాయబద్ధంగా పని చేయాలని గ్రామ పరిపాలన అధికారులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, సర్వే నంబర్లు, చెరువులు, కుంటలు, శిఖం భూములు, ఎఫ్టీఎల్,బఫర్ జోన్ల పర్యవేక్షణ.. తదితర ప్రభుత్వ పరిపాలన వ్యవహారాలన్నీ సమర్థవంతంగా పర్యవేక్షించాలన్నారు. గ్రామీణస్థాయిలో అన్ని ధ్రువీకరణపత్రాల విచారణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు ఎంపికలో నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా వ్యవహరించడమే కాక, గ్రామస్థాయిలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయకర్తలుగా కూడా జీపీవోలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ,ఎ.ఓ. భూపాల్ రెడ్డి, గ్రామ పరిపాలన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు... అలుగు పారుతున్న చెరువులు

గద్వాల జిల్లా ప్రతినిధి(కేటిదొడ్డి), సెప్టెంబర్11(నమస్తే ఉదయం)ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు భారీ వర్షపాతం నమోదైంది. కేటిదొడ్డి మండలంలో 70.5 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆయా గ్రామాలలో వాగులోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో వాగులు పొంగిపొర్లాయి. పలు చోట్ల వర్షానికి వరద నీటిలో పంట పొలాలు మునిగిపోయాయి. పలు గ్రామాలలో పల్లపు ప్రాంతంలో ఉన్న ఇళ్ల మధ్య వరద నీరు నిలిచింది. పత్తి చేను, వరి పొలాల్లో వరద నీరు చేరడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అనేక ప్రాంతాలలో రైతులు సాగు చేసిన పత్తి చేలు వర్షపు నీటిలో మునిగిపోయాయి. అదేవిధంగా మిరప, తదితర పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, పంట నష్టాలను అంచనావేసి ప్రభుత్వం తమను ఆదుకునేలా కృషి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఆంబులెన్స్ డ్రైవర్ నిర్వాహకం... అదుపుతప్పిన ఆంబులెన్స్

కేటిదొడ్డి, సెప్టెంబర్11 (నమస్తే ఉదయం)ఆంబులెన్స్ డ్రైవర్ నిర్వాహకం వల్ల రవాణ సౌకర్యం లేని రోడ్డు మార్గనా వెళ్తున్న ఓ ఆంబులెన్స్ అదుపుతప్పి ఇరుకపోయింది. ఆ సమయంలో ఆంబులెన్స్ లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన గురువారం కేటి దొడ్డి మండలంలో చోటుచేసుకుంది వివరాలోకి వెళ్లితే.... కేటిదొడ్డి మండలం పూజారీ తండాకు చెందిన గర్భిణీ స్త్రీలను హెల్త్ చెకప్ కోసం 108 ఆంబులెన్స్ లో ధరూర్ పీహెచ్ సీకి తరలించారు. హెల్త్ చెకప్ అనంతరం గర్భిణీ స్త్రీల ను గువ్వలదిన్నె రోడ్డు మీదుగా పూజారీ తండాకు తీసుకొచ్చారు. అక్కడ వారిని దింపేసి తర్వాత వడ్లందొడ్డి మీదుగా నందిన్నెకు వెళ్లేందుకు తండా చెరువుకట్ట మట్టి రోడ్డుపై అంబులెన్స్‌తో వెళ్తున్న సమయంలో మట్టి రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రమాదవశాత్తు ఆంబులెన్స్ అదుపుతప్పి మట్టిలో కూరుకుపోయింది. ఆంబులెన్స్ ను బయటకు తీయడానికి స్థానికులు ప్రయత్నించారు. చివరికి జేసీబీ సాయంతో ఆంబులెన్స్ ను బయటకు తీసి రోడ్డు పై న ఉంచారు. పూజారితండా నుంచి గువ్వలదిన్నె రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలు సాగుతాయి. పూజారీతండా చెరువు కట్ట మీదుగా వడ్లందొడ్డి, నందిన్నెకు వెళ్లేందుకు రవాణ సౌకర్యం లేదు. కాని ఆంబులెన్స్ డ్రైవర్ అజాగ్రత్తతో భారీ వాహనాలు వెళ్లడానికి అవకాశం లేని రోడ్డుపై ఆంబులెన్స్ తీసుకెళ్తుండటంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. పూజారీ తండా నుంచి కర్ణాటక లోనీ వడ్లందొడ్డికి రోడ్డును మరమ్మతులు చేసి బాగు చేయాలని గ్రామస్తులు కోరారు.




## ప్రజలకు సందేశం ఇచ్చిన గద్వాల కోర్టు

**జైలు శిక్షకు బదులుగా "సమాజ సేవ"**

**ప్లకార్డు పట్టుకుని అవగాహన కల్పించాలి**

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(నమస్తే ఉదయం)భారత న్యాయ సురక్షా స్మృతి కొత్త చట్టం కింద జిల్లాలో తొలి తీర్పు నూతనంగా అమల్లోకి వచ్చిన చట్టం మేరకు గురువారం జోగులాంబ గద్వాల జిల్లాలో తొలి తీర్పు వెళ్లడయింది. ఈ చట్టంలోని 355వ సెక్షన్ ఉపయోగిస్తూ గురవారం గద్వాల మొదటి అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉదయ్ నాయక్ మద్యం మత్తులో పోలీసులకు చిక్కిన ఓ వ్యక్తి జైలు శిక్షకు బదులుగా సమాజ సేవ విధిస్తూ తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.... కేటి దొడ్డి మండలం ఉమ్మిత్యాల గ్రామానికి చెందిన ఈరన్న (30) అనే వ్యక్తి అదే మండలంలోని నందిన్నె గ్రామం వెలపల ప్రధాన రోడ్డు పక్కన మద్యం సేవిస్తూ పోలీసులకు చిక్కాడు. అదుపులోకి తీసుకున్న స్థానిక ఎస్సై బి. శ్రీనివాసులు కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఈ కేసు విచారణ సందర్భంగా కోర్టులో హాజరైన నిందితుడు ఈరన్న తన తప్పును అంగీకరించాడు. దీనితో కోర్టు పునరావాసం, సమాజానికి మేలుచేసే విధంగా శిక్షను విధించడం సముచితమని అభిప్రాయపడింది. కోర్టు తీర్పు ప్రకారం, నిందితుడు శుక్రవారం ఉదయం 10:30 గంటల నుండి 11:30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రి జంక్షన్ వద్ద "మత్తులో వాహనం నడపవద్దు" అని రాసిన ప్లకార్డు పట్టుకుని నిలబడి మద్యం మత్తులో వాహనాలు నడిపే వారికి హెచ్చరికలు వెళ్లేలా చూడాలని అదేశించారు."శిక్ష దండన రూపంలో కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలి అని మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కలిగించడం అవసరం" అని న్యాయమూర్తి ఉదయ నాయక్ ఈ సందర్భంగా తమ తీర్పులో పేర్కొన్నారు. ఈ తీర్పు సమాజంలో మద్యం మత్తులో వాహనం నడిపే వారిపై కఠిన హెచ్చరికగా, అలాగే ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే అలవాట్లపై ఒక జాగృతి సందేశంగా నిలిచే అవకాశం ఉందిన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

కొత్తకోట, సెప్టెంబర్ 11( నమస్తే ఉదయం) భారతీయ జనతా పార్టీ కొత్తకోట పురపాలక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తూఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు.లి ఈ కార్యక్రమం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎద్దుల రాజ వర్ధన్ రెడ్డి నేతృత్వంలోకొత్తకోట పీపుల్ స్కూల్ సెంట్రల్ ఆఫీసు లో నందు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన దేవన్న ,జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నాగమణి, పి సురేష్ సాగర్, వెంకట్ నారాయణ, బి. హుస్సేన్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము భరత్ భూషణ్, సబిరెడ్డి నారాయణమ్మ ,వెంకట్ రెడ్డి,వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, గందు రవీందర్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. పేదరికానికి అసమానతలు మూలమైతే ఆ అసమానతలను అధిగమింపజేసేదే చదువు అన్నారు.



భూభారతి దరఖాస్తుల పరిష్కారం కోసం కలెక్టరేట్లో రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

## భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ, సెప్టెంబర్ 11(నమస్తే ఉదయం): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భూ భారతి, సాదా బైనామ, జాతీయ కుటుంబ లబ్ది పథకం, సి.ఎం.ప్రజావాణి దరఖాస్తుల పై అదనపు కలెక్టర్ బెన్షా లోమ్, ఆర్డీఓ లు గోపిరామ్, వెంకన్న ల తో కలిసి తహసీల్దార్ లతో గురువారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్షించారు. భూ భారతి దరఖాస్తు లను వేగవంతం గా పరిష్కరించడంలో తహ సీల్దార్ల సందేహాలను నివృత్తి పరుస్తూ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. సర్వేయర్లు, గ్రామపంచాయతీ అధికారుల సేవలను వినియోగించుకొని సత్వరమే పరిష్కరించాలన్నారు. శిక్షణ పొందిన సర్వేయర్ల ను క్షేత్ర స్థాయి పర్యవేక్షణ కు తీసుకెళ్లాలని, కార్యాలయాలలో దరఖాస్తుల పరిశీలన లకు ఉపయోగించాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులతో పనులు తీసుకోవాలన్నారు. సి.ఎం. ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, జాతీయ కుటుంబ లబ్ధిదారుల పథకం అమలుకు లబ్దిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. యూరియా పంపిణీ సక్రమంగా జరిగే విధంగా విస్తృతంగా తనిఖీలు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. రికార్డ్ లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. యూరియా స్టాకు, గోడౌన్ లో నిల్వ,విక్రయించిన వివరాలు, కొనుగోలు చేసిన రైతుల వివరాలు రిజిస్టర్ లో నమోదు చేశారా లేదా అన్నది సమగ్రంగా పరిశీలించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవోలు గోపిరామ్, డి.ఎస్.వెంకన్న, కలక్టరేట్ ఏ.ఓ.శ్రీకాంత్, తహసీల్దార్ లు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




## మొకురాల స్వర్ణలతకు డాక్టరేట్

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(నమస్తే ఉదయం): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన మొకురాల రామేశ్వర శర్మ, సరోజ దంపతుల చిన్న కుమార్తె స్వర్ణలత డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా స్వర్ణలత పనిచేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పెబ్బేరుకు చెందిన ప్రముఖ కథా రచయిత వల్లపురెడ్డి బుచ్చారెడ్డి సాహిత్యంపై చేసిన పరిశోధనకు గానూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎన్.రజినీ పర్యవేక్షణలో 'వల్లపురెడ్డి బుచ్చారెడ్డి జీవితం, సాహిత్యం' అనే అంశంపై స్వర్ణలత పరిశోధన జరిపారు. త్వరలో జరగనున్న స్నాతకోత్సవంలో గవర్నర్ చేతులమీదుగా స్వర్ణలత డాక్టరేట్ పట్టా అందుకోనున్నారు.



జనగామ చంపక్ హిల్ ఎన్ఎచ్ హైవే పైన వర్షపు నీరు నిల్వడంతో వాహనాలు వెళ్లేందుకు డ్రమ్ములు పెట్టి దారి చూపుతున్న సిపిఎం పార్టీ నాయకులు

## చంపక్ హిల్స్ ఎన్ హెచ్ రోడ్డులో వర్షపు నీరు నిలవకుండా ఎన్ హెచ్ అధికారులు చర్యలు చేపట్టాలి

**సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి**

జనగామ, సెప్టెంబర్ 11(నమస్తే ఉదయం): జనగామ ప్రాంతంలో గురువారం సాయంకాలం నుండి కొడుతున్న భారీ వర్షం వల్ల చెంపకిల్స్ కొండ ప్రాంతంలో ఎన్హెచ్ రోడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో భారీగా వర్షపు నీరు చేరి జలమయం తో చెరువును తలపిస్తున్నది. ఈ వర్షపు నీరులో పెద్దపెద్ద నడుములలోతు గుంటలు ఉండడం వల్ల జనగామ నుండి చేర్యాలకు పోతున్న రెండు కార్లు ప్రమాదానికి గురై దిగబడ్డాయి ఈ విషయం తెలిసి జనగామ సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఎండి అజారుద్దీన్, ఆవుల శ్రీనివాసరెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్ సహాయంతో కారు సురక్షితంగా బయటికి తీపించారు. ఈసందర్భంగా మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నత్తనడకగా నడుస్తున్నాయని ఇదే సందర్భంలో వర్షాకాలం కావడం వల్ల వర్షాలు పడ్డప్పుడు వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదని తెలియని ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి కూడా వర్షం పడే సూచన ఉన్నది కాబట్టి తక్షణం ఎన్ హెచ్ అధికారులు స్పందించి ఈ రోడ్డుపై నీటి నిల్వలు ఉండకుండా చూడాలని డిమాండ్ చేసారు. జిల్లా కలెక్టర్ వర్షం తీవ్రత పరిస్థితి ఉన్నందున అన్ని శాఖల అధికారులు అలర్ట్ చేసి రహదారులపై కలువర్టులు అదే రకంగా గానుగుపాడు బ్రిడ్జి వద్ద వాగు ఉధృతంగా పారుతున్నందున పోలీసు రెవెన్యూ సిబ్బందిని రిస్క్ టీములను ఏర్పాటు చేయాలని నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.

# అటవీ అమరవీరుల త్యాగాలు ఉరకే పోనివ్వం



అటవీ అమరవీరుల స్తూపం వద్ద మంత్రి కొండా సురేఖ, డిజిపి జితేందర్..



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి కొండా సురేఖ

**జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ**

**పీడీ యాక్టుకు తగిన సవరణలతో నేరస్తులకు కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్న మంత్రి**

**ఇక పై ప్రతిభావంతులైన ఫ్రంట్‌లైన్ అధికారులకు ఏటా రూ. 10 వేలు నగదు పురస్కారం**

**క్రూరమృగాల దాడిలో మరణిస్తే ఇక పై రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియాలి**

**మంత్రితో కలసి అమరులకు నివాళులు అర్పించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, డీజీపీ డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, రాష్ట్ర అటవీ ప్రధాన అధికారిణి డాక్టర్ సువర్ణ తదితరులు.**

హైదరాబాద్ (బహదూర్ పుర), సెప్టెంబర్ 11(నమస్తే ఉదయం) అటవీ సంపద పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని రాష్ట్ర అటవీ శాఖ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఇక పై ప్రతిభావంతులైన ఫ్రంట్‌లైన్ అధికారులకు ఏటా రూ. 10 వేలు నగదు పురస్కారం అందిస్తామని ఆమె ప్రకటించారు. అటవీ సంపదను దోచుకునే స్మగ్లర్లు, అరాచక ముఠాలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి అమరణల త్యాగాలు వృథా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారని ఆమె గుర్తు చేశారు. గురువారం నగరంలోన నెహ్రూ జూలాజికల్ పార్కు ఆవరణలోని అమరవీరుల విగ్రహం వద్ద నిర్వహించిన జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, డీజీపీ డాక్టర్ జితేందర్, రాష్ట్ర అటవీ ప్రధాన అధికారిణి డాక్టర్ సువర్ణలతో కలసి పాల్గొని స్మారక చిహ్నం వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... విధి నిర్వహణలో అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో 1984వ సంవత్సరం నుండి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో 22 మంది తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడం చాలా బాధకరమన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. అటవీ సంపదను రక్షించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అటవీ శాఖ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కలప అక్రమ రవాణాను కట్టడి చేయడానికి సాయుధ పోలీసు దళాల సహకారం తీసుకొని ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. అటవీ సంరక్షణ బలోపేతానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్తగా 2,181 వాహనాలు సమకూర్చడం జరిగిందని గుర్తు చేశారు. అడవుల్లో గడ్డి భూములు, నీటి వనరులు అభివృద్ధి చేయడం ద్వారా పంటపొలాలు, పశువులపై వన్యప్రాణుల దాడులను అరికట్టుతున్నట్లు తెలిపారు. క్రూరమృగాల దాడిలో బాధితులకు ఇచ్చే పరిహారాన్ని తమ ప్రభుత్వం పెంచిందన్నారు. క్రూరమృగాల దాడిలో మరణిస్తే గతంలో రూ.5 లక్షలు ఇస్తుండగా, ప్రస్తుతం దానిని రూ.10 లక్షలు పెంచినట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే పచ్చదనం పెంపుదలలో తెలంగాణ ప్రభుత్వము చేపట్టిన “వనమహోత్సవం” మూడవ అతి పెద్ద మానవ ప్రయత్నమన్నారు. వనమహోత్సవం ద్వారా మన రాష్ట్రంలో 307.48 కోట్లకు పైగా మొక్కలను ఇప్పటికే నాటడం జరిగిందన్నారు. ప్రతి గ్రామ పంచాయితీలో మొక్కల పెంపక కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలంగాణ వనమహోత్సవం-2025 పథకంలో భాగంగా గ్రామ పంచాయతీలలో 12,707 నర్సరీలు, మున్సిపాలిటీలలో 600 నర్సరీలతో కలపి మొత్తం 14,355 నర్సరీలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించడానికి, క్షీణించిన అడవులలో అటవీ పునరుద్ధరణ పనులను అన్నీ జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందన్నారు. పీడీ యాక్టుకు తగిన సవరణలు చేసి ఫారెస్టు అధికారులపై దాడి చేసే నేరస్తులపై కఠినమైన శిక్షలు పడేలా చేయడానికి తగు చర్యలు తీసుకుంటారన్నారు. పంచాయతీ చట్టం, పురపాలక చట్టం ద్వారా గ్రామాలలో మున్సిపాలిటీల్లో నాటిన మొక్కలను సంరంక్షించడానికి స్పష్టమైన ఆదేశాలను ఇచ్చామన్నారు. అంతకు ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ స్మగ్లర్లను ఎదుర్కొంటూ అడవులను కాపాడుతున్న అటవీ అధికారులు కృషి అభినందనీయమన్నారు. ఎటువంటి సౌకర్యాలు లేనిచోట, దట్టమైన అడవుల్లో వారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అడవులను కాపాడుతున్నారన్నారని, వీధి నిర్వాహణలో అమలులైన అటవీ అధికారులు, సిబ్బంది త్యాగాలను గౌరవించాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అడవులను కాపాడేందుకు అధికారులు చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. ప్రతినిత్యం ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుతూ మనం జీవించేలా, భవిష్యత్ తరాలకు జీవం పోసేలా చేస్తున్న అటవీ అధికారుల సేవలు అభినందనీయమన్నారు. ప్రకృతిని కాపాడటం కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను గౌరవించడం అందరి బాధ్యత అని గుర్తుచేసారు. రాష్ట్ర అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ మాట్లాడుతూ... అడవులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.వాటిని కాపాడటమే అమరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో 24 శాతం ఉన్నఅడవులను 33 శాతం పెంచే విధంగా కృషి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణ అధికారిణి డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ నిరంతరం వన్య సంపద , వన్య ప్రాణుల సంరక్షణ కోసం అటవీ సిబ్బది, అధికారులు పోరాడుతున్నారన్నారు. అడవుల పరిరక్షణ కోసం బయట ప్రపంచానికి దూరంగా, సరైన సదుపాయాలు కూడా లేని చోట తమ సిబ్బంది పనిచేస్తున్నారని గుర్తుచేశారు.ఇప్పటి వరకు వన్య సంపద రక్షణ కోసం చనిపోయిన 22 మంది అమరులను స్మరించుకోవడం మన బాధ్యతని తెలిపారు.అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎస్,డిజిపిలు భాగస్వామ్యం అవడం అటవీ అధికారులకు వారు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎలుసింగ్ మేరు, పిసిపిఎఫ్ జౌహరి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, సౌత్ జోన్ డిసిపి స్నేహామెహరా, అడిషనల్ పిసిపిఎఫ్ లు సి. శరవనణ్, , ప్రియాంకవర్గీస్, జూపార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్ హిరెమత్, క్యూరేటర్ జె. వసంత, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ లు యన్. క్షితిజ, డాక్టర్ జి. రామలింగం, జిహెచ్ఎంసి అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ వివిఎల్. సుభద్రాదేవి, జూపార్క్ డిప్యూటీ డైరెక్టర్ (వెట్) డా.ఎం.ఎ. హకీమ్, డిప్యూటీ క్యూరేటర్ మల్ దొడ్డి బర్నోబా, అసిస్టెంట్ డైరెక్టర్ (వెట్) శ్రీనివాస్ , మాజీ క్యూరేటర్ లు ఎ. శంకరణ్, రాజశేఖర్, మాజీ డిప్యూటీ క్యూరేటర్ ఎ. నాగమణి, అసిస్టెంట్ క్యూరేటర్లు నాజియా తబుసుమ్, ఎన్.లక్ష్మణ్, డిఆర్ఓలు మాదవీలత,కరుణాకర్, ఎఫ్ఎస్ఓలు వెంకట్ రావు, మంజుల, పిఆర్ ఓ హనీఫ్ ఉల్లా, జడ్ఈఓ దీపక్,జూ పరిపాలన విభాగం అధికారులు ఖుద్దుస్, పిఎస్ ఎన్ శ్రీనివాస్, లియాకత్ హుస్సేన్ , జూ సార్జెంట్ ఎం.ఎ. రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువతకు మెరుగైన శిక్షణ

# కార్యక్రమాలు చేపట్టే విదంగా చర్యలు



వర్క్ షాప్ లో పాల్గొన్న సీనియర్ ఐ ఏ ఎస్ అధికారులు

బుద్వేల్, సెప్టెంబరు 11 (నమస్తే ఉదయం) : గ్రామీణ యువత కు ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి.. అందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రెండు రోజుల పాటు రాజేం ద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్ డీ పీఆర్) లో ఎస్ ఆర్ శంకరన్ చైర్ ఆధ్వర్యంలో నేషనల్ వర్క్ షాప్ ఆన్ స్కిల్లింగ్ రూరల్ ఇండియా అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం ఎన్ఐఆర్ డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలలో పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారులు, ప్రస్తుతం వివిధ హోదాలలో పనిచేస్తున్న అధికారులు సుమిత దావా, డాక్టర్ పూనమ్ సిన్హా, ఉషారాణి, హరి చందన, సీత పల్లచోల, డాక్టర్ జ్యోతీస్ సత్య పాలన్, డాక్టర్ పార్థ ప్రతీమ్ సాహు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో యువత కు ప్రస్తుతం ఇస్తున్న ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఎలా అమలౌతున్నాయి. వారు ఎలాంటి శిక్షణలు కోరుకుంటున్నారు... వాటిని అమలు చేయడానికి తీసుకోవల్సిన జాగ్రత్తల పై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్ డీ పి ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ, యువత కు నైపుణ్యంతో కూడిన శిక్షణలు ఏ విదంగా చేపడితే బాగుంటుంది అనే అంశంపై వివిధ రంగాల ప్రతినిధులు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. శుక్రవారం జరిగే శిక్షణ అనంతరం ఒక నిర్ణయానికి వచ్చి భవిష్యత్తులో ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు గ్రామీణ యువతకు ఇవ్వాలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.



తొండుపల్లి మల్లేష్ సంతాప సభలో పాల్గొన్న చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ తదితరులు

## బీజేపీ నాయకుడు తొండుపల్లి మల్లేశ్ మృతి భాదాకరం: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

బుద్వేల్, సెప్టెంబరు 11 (నమస్తే ఉదయం): ఇటీవల అనారోగ్యంతో మరణించిన బీజేపీ రాజేం ద్రనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు తొండుపల్లి మల్లేశ్ పార్టీ కోసం చేసిన సేవలు గొప్పవని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నవ జ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో గురువారం తొండుపల్లి మల్లేశ సంతాప సభ ను నిర్వహించారు. ఈ సందర్బంగా వచ్చిన పెద్దలు, వివిధ పార్టీల నాయకులు మల్లేశ్ కుంటుంబ సభ్యులకు రూ.79 వేలను అందజేశారు. ఆ మొత్తాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా మల్లేశ్ సోదరుని కి ఇచ్చారు. కార్యక్రమంలో మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి , బీజేపీ నాయకులు బోసుపల్లి ప్రతాప్, వై.శ్రీధర్, ఎన్. మల్లారెడ్డి, ఎం. కొమురయ్య, బి.రమేశ్, కోరని సదానంద్. పి.మల్లేశ్ యాదవ్. పసుపుల సందీప్ ముదిరాజ్, మేకల వనితా దామోదర్ రెడ్డి , జోగి రవి, జి బాబు రావు తదితరులు పాల్గొన్నారు.




## జిల్లాలో గ్రంథాలయ పన్ను బకాయిలను త్వరగా చెల్లించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(నమస్తే ఉదయం)జిల్లాలో గ్రంథాలయ పన్ను బకాయిలను త్వరగా చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు.గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు గ్రంథాలయ పన్ను వసూలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ జోగులాంబ గద్వాల జిల్లాకు గ్రంథాలయ పన్ను, 8 శాతం (ఆస్తి పన్ను పై ) వివిధ గ్రామపంచాయతీల నుంచి మరియు మున్సిపాలిటీల నుంచి రావాల్సిన గ్రంథాలయ పన్ను బకాయిలను త్వరగా చెల్లించాలని మున్సిపాలిటీ కమిషనర్లకు,జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,జిల్లా ఆడిట్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ,మున్సిపాలిటీ కమిషనర్లు,కార్యదర్శి జిల్లా గ్రంథాలయ సంస్థ, తదితరులు పాల్గొన్నారు.



అత్తాపూర్ భాష్యం స్కూల్ ముందు రోడ్డు లో మురుగు నీరు ప్రవాహం

## పాఠశాలల ముందు మురుగునీటి ప్రవాహాలు

బుద్వేల్, సెప్టెంబరు 11 (నమస్తే ఉదయం) :అత్తాపూర్ భాష్యం స్కూల్ ముందు రోడ్డులో ప్రతి రోజు మురుగున్నీరు ప్రవహిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లితం డ్రులు వాపోతున్నారు. వ్యాపార సముదాయాలు, వాణిజ్య సంస్థలు ఉన్న అత్తాపూర్ లో విద్యా సంస్థల ముందు మురుగునీరు ప్రవహిస్తుండటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు స్పందించి రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండ చూడాలని కోరుతున్నారు.

# పోలీయోపై విస్తృతంగా దృష్టి సారించాలి





### జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజేంద్రనగర్,సెప్టెంబర్11(నమస్తే ఉదయం) పోలీయోపై అవగాహనలు విస్తృతం చేసి నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు.సబ్ నేషనల్ ఇమ్యునైజేషన్ పోలియో కార్యక్రమం అక్టోబర్ 12వ తేదీన జరగనున్న సబ్ నేషనల్ ఇమినైజేషన్ దినోత్సవంలో పోలియో కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఉప వైద్యాధికారులకు, వైద్యాధికారులకు,సూపర్వైజర్లకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారికి శిక్షణ కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...అక్టోబర్ 12వ తేదీన జరగనున్న సబ్మినేషనల్ ఇమ్మైజేషన్ దినోత్సవం పోలియో కార్యక్రమంలో ఐదు ఏళ్లలోపు వయసు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు.నవజాత శిశువులకు కూడా వేయాలని కోరారు.అక్టోబర్ 12న ఆదివారం రోజు పోలియో బూతులలో చుక్కలు వేస్తారని,13 నుంచి 15 వ తేదీ వరకు గృహ సందర్శన చేసి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.ఐదు సంవత్సరాల వయసు గల లోపల ఉన్న ప్రతి ఒక్క శిశువులకు కూడా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బందిని ఆరోగ్య కార్యకర్తలను,ఆశా కార్యకర్తలను,మహిళా గ్రూపులను భాగస్వామ్యం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎంఓ డాక్టర్ మురారి,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శిభ హయత్,జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ విజయ పూర్ణిమ,డాక్టర్ గీత డాక్టర్ విజయలక్ష్మి,డాక్టర్ నాగేంద్రబాబు,డాక్టర్ సుధ,పోగ్రామ్ అధికారులు డాక్టర్ వినోద్,డాక్టర్ రాధిక,డాక్టర్ రాకేష్,డాక్టర్ పూనమ్,డెమో శ్రీనివాసులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు విస్మరిస్తున్న ఎమ్మెల్యే

### శివరాంపల్లి రైల్వే గేట్ సమస్యకు మోక్షమెప్పుడో.?
### మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్



రాజేంద్రనగర్,సెప్టెంబర్11(నమస్తే ఉదయం) ప్రజా సమస్యలను స్థానిక శాసనసభ్యులు విస్మరిస్తున్నారని మైలార్దేవ్ పల్లి డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ ఆరోపించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి రైల్వే గేట్ మరమ్మతుల పేరుతో తవ్వకాలు చేసి తాత్కలికంగా రాకపోకలు నిలిపివేసి ఇప్పుడు పూర్తిగా రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురుమ అన్నారు.తవ్వకాలు చేయడంతో గోడ నిర్మాణం చేపట్టి ప్రారంభంలో దీన్ని తాత్కాలికం అని చెప్పి,ఇప్పుడు అది శాశ్వతంగా మార్చారని ఆయన మండిపడ్డారు.ప్రజలు గత నాలుగేళ్లుగా సమస్యపై అనేకసార్లు ఎమ్మెల్యే,కార్పొరేటర్,ఎంపీకి దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించారు.ఇప్పటి వరకు పట్టించుకున్న పాపనపోలేదన్నారు.దీంతో విద్యార్థులు ప్రాణాలను ఫణంగా పెట్టి గోడలెక్కుతూ వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చిన్నారులు,మహిళలు,వృద్ధులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ సమస్యపై స్పందించి,బస్తీవాసులకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులను కోరారు.ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో పెట్టుకొని తక్షణమే గేట్ కు అడ్డంగా కట్టిన గోడని తొలగించి రోడ్డుని యధావిధిగా రాకపోకలకు అనుమతివ్వాలని, లేనిపక్షంలో రైల్వే గేట్ పైనుంచి ఫై ఓవర్ కానీ,అండర్ పాస్ కానీ నిర్మించి బస్తీల ప్రజలకు రావడానికి వెళ్లడానికి అంతరాయం లేకుండా చూడాలని రైల్వే అధికారులను,స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు.



### అనారోగ్యంతో ఉప్పర్‌పల్లికి చెందిన
# పోరెడ్డి రవీందర్ రెడ్డి మృతి

బుద్వేల్, సెప్టెంబరు 11 (నమస్తే ఉదయం) : ఉప్పర్ పల్లి కి చెందిన పోరెడ్డి రవీందర్ రెడ్డి మరణం బాధాకరమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి సోదరుడు పోరెడ్డి రవీందర్ రెడ్డి మరణించడంతో గురువారం ఉప్పర్ పల్లి లోని వారి నివాసానికి వచ్చిన పి.సబితా ఇంద్రారెడ్డి పోరెడ్డి రవీందర్ రెడ్డి భౌతిక కాయంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళు లర్పించారు. రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పోరెడ్డి ధర్మారెడ్డికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, సామ ఇంద్రపాల్ రెడ్డి, విజయపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



పోరెడ్డి రవీందర్ రెడ్డి భౌతిక కాయాన్ని దర్శించుకుని నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

# పేదలు నివసించే బస్తీ రోడ్లు పట్టవా





గగన్ పహాడ్ లో అధ్వాన్నంగా రోడ్లు పాడైన రోడ్లు

### సీనియర్ నాయకుడు తలారి అశోక్

బుద్వేల్, సెప్టెంబరు 11 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ గగన్ పహాడ్ లో పేదలు నివసించే బస్తీలో రోడ్లు పాడై అద్వాన్నంగా ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదని సీనియర్ నాయకుడు తలారి అశోక్ వాపోయారు. 15 సంవత్సరాల క్రితం గగన్ పహడ్ పేదల బస్తీలో వేసిన రోడ్లు మాత్రమే ఉన్నాయని, ఆ తర్వాత ఎవరు కూడా రోడ్లు వేయలేదన్నారు. పేదలు, ఆదరణకు నోచుకోని వారు అన్నా, వారు నివసిస్తున్న ప్రాంతాలు అంటే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పట్టదా అని తలారి అశోక్ ప్రశించారు. ఒక వైపు కాలుష్య పరిశ్రమలు, మరో వైపు ఆధ్వాన్నమైన రోడ్లు, వీధులలో పారుతున్న మురుగునీరు, దోమల బెడద ఇలా అనేక సమస్యలతో పేద ప్రజలు బాధపడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు మా బస్తీలో ఒక సారి పర్యటించి రోడ్డు సమస్యలు పరిష్కరించాలని తలారి అశోక్ కోరారు.




## హిందూ స్మశాన వాటికలో వసతులు కల్పించడానికి కృషి చేస్తా
### కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫెరోజ్ గూడ హిందూ స్మశానవాటికలో జరుగుతున్నా మౌలిక వసతులు, సుందరికరణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక బస్తీ వాసులతో కలిసి బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, దేవులపల్లి కృష్ణమూర్తి, ఎడ్ల ప్రభాకర్, బస్తి పెద్దలు ఎడ్ల సదానంద్, యాదయ్య, బిఆర్ఎస్ డివిజన్ మహిళ అధ్యక్షురాలు కాతురాయ కవిత, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏ ఈ ఆశ, వర్క్ ఇన్స్పెక్టర్ రాములు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రినగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ రిపేరింగ్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (నమస్తే ఉదయం)కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ శాస్త్రినగర్ లో రూ.30 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ మరమ్మత్తు పనులను గురువారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ స్థానిక బస్తీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ... కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో నిధులు మంజూరు చేయించుకుని బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు కమిటీ హాల్ రేకుల షెడ్డు యొక్క హైట్ పెంచుతూ వధూవరులకు రూమ్ నిర్మాణం కొరకు పనులను ప్రారంభించామని అన్నారు. ఈ కమిటీల వల్ల బస్తీలో ఏ చిన్న కార్యమైన, వివాహమైన అందరికీ అందుబాటులో వచ్చే విధంగా తీర్చి దిద్దడం జరిగిందని, కాబట్టి బస్తి వాసులు ఈ కమిటీలను సద్వినియోగపరచుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు, రాష్ట్ర నాయకులు కుతాడి రాములు, శివశంకర్ గౌడ్, సాగర్, కృష్ణ, బద్రిశంకర్, అఫ్జల్, బెట్టు శీను, మధు, డబ్బా రాజు, శ్రీను, ప్రభాకర్, ఉదయ్, విశ్వనాథ్ పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.




# హెచ్-1బీ వాడకంలో 56 శాతం కోత

### స్థానిక ఉద్యోగుల వైపే భారత ఐటీ దిగ్గజాల మొగ్గు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:**

తమ ఉద్యోగాలను విదేశీయులు లాక్కుంటున్నారని అమెరికాలో హెచ్-1బీ వీసాలపై ఆంక్షల కోసం డిమాండ్లు పెరిగిపోతున్న వేళ గడచిన ఎనిమిది సంవత్సరాలలో హెచ్-1బీ వీసాలపై ఆధారపడడాన్ని భారతీయ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) సర్వీసెస్ కంపెనీలు గణనీయంగా తగ్గించివేయగా ఆ వీసాలను అత్యధికంగా అమెరికన్ కంపెనీలే ఉపయోగించుకుంటున్నాయి. భారత్‌లోని ఏడు ప్రముఖ ఐటీ కంపెనీల నుంచి ప్రాథమిక ఉద్యోగం కోసం హెచ్-1బీ దరఖాస్తులు గడచిన ఎనిమిదేళ్లలో దాదాపు 56 శాతం తగ్గాయి. 2015లో దాదాపు 15,100 దరఖాస్తులు చేసుకోగా 2022-23లో కేవలం 6,700 దరఖాస్తులు మాత్రమే ఈ కంపెనీలు చేసినట్లు నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ(ఎన్ఎఫ్ఏపీ) గణాంకాలు తెలిపాయి. ఒకప్పుడు హెచ్-1బీ స్పాన్సర్ చేయడంలో అగ్రగామిగా ఉన్న ఓ ప్రముఖ భారతీయ ఐటీ సర్వీసెస్ కంపెనీ ఇదే కాలంలో 75 శాతం అప్రూవల్స్‌ని తగ్గించివేసింది. మరో పక్క అమెరికాకు చెందిన ఐదు ప్రముఖ ఐటీ కంపెనీలు 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 28,000 హెచ్-1బీ వీసా ఆమోదాలు సంపాదించుకున్నాయి.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733